

★

ఆ్రవేళ ఆదివారం—

ఆఫీసు-శలవు అవటంచేత కాగితం కలం తీసుకుని బయలుదేరేను బీచికి—.

సంధ్యా కాంతులలో పడిన సముద్ర కెరటాలు బంగారు రేఖలను విరజిమ్ముతున్నాయి—

దూదిపరుపులా అమర్చబడిన ఇసుక పాయలలో కూర్చుని కథ రాద్దామనుకున్నా—.

చలికలబడి జేబులోని షో...ని తీసి వెలిగించేను దూరాన్ని...

సముద్రపొడ్డున తడి యిసుకతో పిల్లలు పిచుక గూండ్లు కట్టుకుని కిలకిల నవ్వుతూ ఆనందిస్తున్నారు—.

కొంతమంది...

కొట్టుకువచ్చిన కెరటాలకు ఆనకట్టు కట్టి ప్రయత్నిస్తున్నారు—.

యువతులు యువకులు, ఆనందంతో జంట విహారాలు చేస్తున్నారు—.

అంతా...చూట్టానికి చాలా బేషుగ్గావుంది-...షో...ని పారేసి ఆలోచిస్తున్నా...—

అయితే వ్రాయటం యేలా...???

ఈనాడు యీ మన మాయలోకంలో అన్నీ సమస్యలే—

ఏ సమస్యగురించి వ్రాయటమా అన్న సందేహం నన్ను బాధపెట్టటం ప్రారంభించింది—

బీదసాదలె...గురించి వారి నిత్యజీవితాలను కథగా వ్రాస్తే...???

చప్పున శరత్ బాబు రచన జ్ఞాపకానకి వచ్చింది—బీదసాదల నిత్యదైనందిక జీవితాలు గురించి కథలు వ్రాసి సంఘంలో చైతన్యం రేకిత్తానవడం కేవలం ఊహాసౌధం...పిచ్చివూహ...వాళ్ళగురించి తల బద్దలకొట్టుకుని వ్రాసినా వాళ్ళు చదువుకో లేరు...చదివినా అర్థంచేసుకోలేరు—

కట్టిన పిచుకగూళ్ళను కెరటం తన్నుకు పోయింది—

మరి దేనిగురించి...???

స్త్రీసమస్యకు ప్రాధాన్యమిస్తూ చిత్రిస్తే!!!...అబ్బే...స్త్రీకి కేవలం స్వేచ్ఛాజీవనం మీదవుండే ఆసక్తి స్వాతంత్ర్యంమీద వుండేదు—స్త్రీస్వాతంత్ర్యం గురించి వాదించి ఫలితాన్ని కనబరుస్తే దాన్ని స్వేచ్ఛాజీవనానికే ప్రాధాన్యమిస్తారు.....అన్న మొపాసా వాదన కలాన్ని ముందుకు పోనిచ్చింది కాదు—

కలం ముందుకు వెళ్ళలేదు—.

కెరటాలు ఒకదాని నొకటి ఢీకొని హోరు మంటున్నాయి—.

ప్రకృతిని చూస్తూ అరగంట గడిపేను.—

కథరాసే విధానం తెలియలేదు—.

రాద్దామనే దీక్ష ముందుకు లాగుతున్నాది–

దీక్షబద్ధుడు యేనాటికైనా జయించగలడు అన్న గీతాస్మృతి జ్ఞాపకానికి వచ్చింది—.

కలం గట్టిగా దులిపి కాగితంమీద పెట్టేను.

ముత్యాలలాంటి అక్షరాలు కొన్ని రాలేయి–ఆనందం పట్టలేకపోయేను.—కలం వడివడిగా ముందుకు పోతున్నాది—. భావాలు ఒకదానినొకటి తాకి నురగను సృష్టిస్తున్నాయి.—వెన్నకన్నా యింపైన ఆ నురగలు క్షణక్షణానికీ వింతరూపం రాలుస్తున్నాది.—

మూడుపేజీలు...వ్రాతలో లీనం—.

* * *

"మీరు కవులా...???

సమాధి భగ్నమైంది...కలంతిరుగుబాటు...సహించలేకపోయా...కోపంతో చూసేను.—ఎదురుగుండా ఓ అమ్మాయి నుంచుని వుంది.—

"భంగం కలిగించేనుకాబోలు క్షమించండి."

"అబ్బే...రండి ఫర్వాలేదు—"

ఆమె కూర్చుంది—క్షణం నిశ్శబ్దం—

"మీ కథలు యింతకుముందు యేపత్రికలోనేనా అచ్చైనాయా???"

నాకు నవ్వువచ్చింది.—సమాధానం చెప్పకపోతేమో వెగటుగా వుంటుందనుకుని—,

"ఏవో కొద్దిగా ప్రచురిత మయేయి—కొన్నిటికి లోకం ఆనందించింది–మరికొన్నిటికి తిట్టింది–"

"మీరు రాసిన కథలలోకల్లా యేది బాగుంటుందని మీ అభిప్రాయం—"

"నామట్టుకు నేను వ్రాసిన తొలికథ "పద్మకళ"యే బాగుంటుందనుకుంటా—."

"ఇదిగో యిది చూసేరా—???"

అంటూ కాగితం అందించింది—.చూసేను ఒక గీతిక—బాగుంది—మూడుసార్లు చదివేను—

ప్రచండ యుద్ధంవల్ల భారతదేశంలో పేద పౌరులు అనుభవిస్తూన్న యాతనను...చాలీ చాలని తిండితో అఘోరిస్తూన్న రైతు కార్మికులికష్టాలు...స్వార్థత్యాగంకోసం ప్రాణాలను త్యజించిన దేశవీరుల అమాయకత్వం......తినతిండి ధరింపవస్త్రం లేక పంచలంట ప్రాకులాడుతూన్న అమాయక జీవుల ఆక్రందనం—

ఆగీతికలో అతిచక్కగా వర్ణింపబడివుంది—అందిస్తూ...

"పత్రికకు పంపేరా—???"

"లేదు..."

అంటూ ఓ చిరునవ్వు నవ్వింది.

"ఆనందంగా వుండే ప్రకృతిలో మాధుర్యం వుందా?"

అంటూ ప్రశ్నించాను.

"లేదు...నిశ్శబ్దంలో...నిశ్చల సమాధిలో...నిగూఢ రహస్యములో...వుంది మాధుర్యం—"

అని నవ్వింది!

ఐతే మీకు కవిత్వంలో...యెక్కువ అనుభవం వున్నట్లుందే? అని అడిగాను.

కవిత్వంలో కాదు...స్వానుభవంలో...తినడానికి తిండీ...కట్టేందుకు గుడ్డలూలేని స్థితిలో, పుట్టినపాపకు పాలిచ్చి పాలించలేని అభాగ్య స్త్రీలలో నేనొకర్తెను. కొన్నిరోజులక్రింద సమాధికి గురయినవారిలో నేనొకర్తెను...!

ఈ స్వానుభవంకన్నా మీ కవిత్వం యెక్కువేనా? అంటూంటే భయంతో ఓ నిట్టూర్పువిడిచి పైకిలేచాను.

చంద్రుడు దారిచూపిస్తూంటే మా వీధిలోకి వచ్చి మళ్ళీ వెనక్కితిరిగి చూసా. ఆమె వెనకలేదు. జరిగిందంతా తలచుకొని మరో నిట్టూర్పు విడిచా.